## అవినీతిపై సమాచారమివ్వండి

**ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యం పిలుపు**

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): సింగరేణిలో అవినీతి దందాలపై ఉక్కుపాదం మోపుతామని.. అక్రమార్కుల గురించి ధైర్యంగా సమాచారం ఇవ్వాలని సంస్థ యాజమాన్యం పిలుపునిచ్చింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. మోసగాళ్ల సమాచారాన్ని కొత్తగూడెం విజిలెన్స్ శాఖ వారి ఫోన్ నంబర్ 94911 44104కు గానీ, విజిలెన్స్ శాఖ మెయిల్ vig<\@>scclmines. comకి గానీ, ఏసీబీకి అందించాలని కోరింది. సమాచారం ఇచ్చిన వారికి పూర్తి రక్షణతో పాటు వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేసింది. ఆధారాలతో అక్రమార్కులను పట్టించిన వారికి రూ.10 వేల పారితోషకం ఇస్తామని ప్రకటించింది. బదిలీలు, కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వారిని వైద్య పరీక్షల్లో ఫిట్ చేయించడం, డిప్యూటేషన్లు, ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ పరీక్షల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారం ఏసీబీ అధికారులు అరెస్టు చేసిన నేపథ్యంలో సంస్థ ప్రకటన జారీ చేసింది. అమాయకులైన కార్మికులను వంచిస్తున్న ఎవరైనా సరే సంస్థ ఉపేక్షించబోదని, కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేసింది. గతంలోనూ సింగరేణిలో అక్రమాలకు పాల్పడిన ఉద్యోగులపై విచారణ జరిపి డిస్మిస్ చేసిన విషయాన్ని సంస్థ గుర్తుచేసింది. వ్యక్తిగతంగా ఎవరైనా ఫిర్యాదు చేస్తే చర్యలు కూడా తీసుకున్నట్టు వెల్లడించింది. సింగరేణిని అవినీతి రహిత సంస్థగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.

# కుప్పకూలిన పాక్ మార్కెట్లు

**ఆపరేషన్ సిందూర్ దెబ్బకు భీకర నష్టాలు • పీఎస్ఎక్స్ 6,561 పాయింట్లు డౌన్**

**మధ్యలో ట్రేడింగ్ నిలిపివేత • చివర్లో కోలుకున్నా.. 3,521 పాయింట్లు పతనం**




పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నష్టపుటేరులు పారాయి.

**పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేసిన మెరుపుదాడులు.. దాయాది స్టాక్ మార్కెట్లను షేక్ చేశాయి. ఓ దశలో సూచీ ఏకంగా 6,561 పాయింట్లు పడిపోయింది. ట్రేడింగ్‌నూ ఆపేయాల్సి వచ్చింది. అయితే చివర్లో తేరుకున్నా.. అమ్మకాల ఒత్తిడి కారణంగా భారీ నష్టాలనే మూటగట్టుకున్నది.**

కరాచీ, మే 7: పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (పీఎస్ఎక్స్) కుప్పకూలింది. ఇన్వెస్టర్ల సెల్లింగ్ ప్రెషర్.. అమాంతం ఇండెక్స్‌ను పడదోసింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా మంగళవారం అర్ధరాత్రి దాటాక భారత వైమానిక దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై విరుచుకుపడ్డాయి. ఆపరేషన్ 'సిందూర్' పేరిట జరిగిన ఈ అటాక్స్.. దాయాది దేశ స్టాక్ మార్కెట్లనూ ప్రభావితం చేశాయి. ఈ క్రమంలోనే బుధవారం ట్రేడింగ్‌లో పీఎస్ఎక్స్ ఏకంగా 6,500 పాయింట్లకుపైగా నష్టాలను చవిచూసింది.

### ట్రేడింగ్‌కు విరామం..

భారత్ దెబ్బకు కాసేపు పీఎస్ఎక్స్‌లో ట్రేడింగ్‌నే ఆపేయాల్సి వచ్చిందంటే అక్కడి మదుపరులను ఆపరేషన్ 'సిందూర్' ఎంతలా భయపెట్టిందో అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఉదయం ఆరంభమే కేఎస్ఈ-100 సూచీ భీకర నష్టాల్లో కూరుకుపోయింది. మంగళవారం 1,13,568.51 వద్ద ముగిస్తే.. బుధవారం 1,07,296.64 దగ్గర మొదలైంది. ఇలా ఒకానొక దశలో 6,560.82 పాయింట్లు లేదా 5.78 శాతం కోల్పోయి 1,07,007.68 స్థాయికి దిగజారింది. దీంతో నష్ట నివారణలో భాగంగా వెంటనే ట్రేడింగ్‌కు విరామం ఇచ్చారు. ట్రేడింగ్ మళ్లీ మొదలైన తర్వాత కొద్దికొద్దిగా కోలుకోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అయినప్పటికీ 3,521.50 పాయింట్లు లేదా 3.10 శాతం క్షీణించి 1,10,047.01 వద్ద ముగిసింది.

### రెండోసారి..

పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ చరిత్రలోనే ఇంట్రా-డేలో ఈ స్థాయి నష్టాలు వాటిల్లడం ఇది రెండోసారి. గత నెల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌లను ప్రకటించినప్పుడు ఒకానొక దశలో పీఎస్ఎక్స్ 8,700 పాయింట్లు క్షీణించింది. తాజాగా 6,561 పాయింట్లు కోల్పోయింది. ఇదిలావుంటే భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే స్టాక్ మార్కెట్లు మరింత పతనం కావడం ఖాయమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత మార్కెట్ నష్టాలను ఊహించామని, ఏకేడీ సెక్యూరిటీస్‌కు చెందిన ఫాతిమా బుచా చెప్పారు. ఇంకొద్ది రోజులు మదుపరులు ఆచితూచి నిర్ణయాలు తీసుకుంటారని, కాబట్టి ఒడిదొడుకులకు వీలుందన్నారు.

### రంగంలోకి ఆర్థిక శాఖ

స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలకు గురవడంతో మదుపరులలో ధైర్యం నింపేందుకు పాకిస్థాన్ ఆర్థిక మంత్రిత్వ శాఖ ఓ ప్రకటనను విడుదల చేయాల్సి వచ్చింది. ఇందులో దేశ ఆర్థిక సుస్థిరతను కాపాడటానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పింది. ఆర్థిక మార్కెట్లలో ఆత్మ విశ్వాసాన్ని నింపేందుకు ప్రభావవంతమైన నిర్ణయాలుంటాయని కూడా స్పష్టం చేసింది.

## లాభాల్లో భారతీయ మార్కెట్లు

**సెన్సెక్స్ 106, నిఫ్టీ 35 పాయింట్లు అప్**

*దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం లాభాల్లో ముగిశాయి. పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకున్న నేపథ్యంలో ఉదయం సూచీలు భారీ నష్టాలకు గురైనా.. ఆ తర్వాత కోలుకున్నాయి. ఈ క్రమంలోనే బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 105.71 పాయింట్లు లేదా 0.13 శాతం పెరిగి 80,746.78 వద్ద ముగిసింది. అయితే అంతకుముందు ఓ దశలో 79,937.48 స్థాయికి దిగజారిన సూచీ.. మరో దశలో 80,844.63 వద్దకు ఎగిసింది. నిజానికి ఉదయం ఆరంభంలోనే 692 పాయింట్లు పడిపోయింది. మదుపరులు ఒకింత భయాందోళనకు గురవడంతో అమ్మకాల ఒత్తిడి తలెత్తింది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 34.80 పాయింట్లు లేదా 0.14 శాతం అందుకుని 24,414.40 వద్ద నిలిచింది. ఒడిదొడుకుల నడుమ కనిష్ఠంగా 24,220కి, గరిష్ఠంగా 24,449.60కి వెళ్లింది. కాగా, ప్రైవేట్ బ్యాంకులు, టాటా మోటర్స్ తదితర ఆటో షేర్లు, రియల్టీ, మెటల్ రంగాల షేర్లూ నష్టాలను అధిగమించడంలో సూచీలకు సాయపడ్డాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.36 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.16 శాతం చొప్పున పుంజుకున్నాయి. ఇక ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, చైనా, హాంకాంగ్ సూచీలూ లాభాల్లోనే ముగిశాయి.*

## మళ్లీ లక్ష రూపాయలకు పుత్తడి

**మరో రూ.1,000 పెరిగిన తులం ధర**



న్యూఢిల్లీ, మే 7: బంగారం ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో బంగారం ధరలు మళ్లీ లక్ష రూపాయల మార్క్‌ను అధిగమించింది. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర రూ.1,000 ఎగబాకి రూ.1,00,750కి చేరుకున్నది. మంగళవారం ధర రూ.99,750 స్థాయిలో ఉన్నది. గత నెలలో బంగారం ధర రికార్డు స్థాయి రూ.1,01,600 కు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ తర్వాత క్రమంలో అమెరికా-చైనా దేశాల మధ్య ప్రతీకార సుంకాల వివాదం తగ్గుముఖం పట్టడంతో మళ్లీ దిగొచ్చింది. పసిడితో పాటు వెండి మరింత ప్రియమైంది. కిలో వెండి రూ.440 అందుకొని రూ.98,940కి చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 62.12 డాలర్లు లేదా 1.8 శాతం తగ్గి 3,369.65 డాలర్లు నమోదవగా, వెండి 1.24 శాతం తగ్గి 32.81 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.

## స్టాక్ మార్కెట్లోకి మౌరిటెక్

హైదరాబాద్, మే 7: రాష్ట్రానికి చెందిన ఐటీ సొల్యూషన్స్ అండ్ సేవల సంస్థ మౌరిటెక్..స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టడానికి సిద్ధమవుతున్నది. రూ.1,500 కోట్ల నిధుల సేకరణకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. గతంలో సెబీకి దరఖాస్తు చేసుకున్న సంస్థ..ఆ తర్వాత విరమించుకున్నది. మళ్లీ తొమ్మిది నెలల తర్వాత ఈ నెల మొదట్లో సెబీకి దరఖాస్తు చేసుకున్నది. సెబీకి సమర్పించిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్‌పెక్టస్‌లో కొత్తగా షేర్లను విక్రయించడం ద్వారా రూ.250 కోట్లు, ప్రమోటర్లు, ఇతర వాటాదారుల వాటాను విక్రయించడం ద్వారా మరో రూ.1,250 కోట్లు సేకరించాలనుకుంటున్నంది. ప్రమోటర్లలో సుజాయ్ పతురు రూ.726.30 కోట్ల విలువైన షేర్లు, అనిల్ రెడ్డి యెర్రంరెడ్డి రూ.370.60 కోట్ల విలువైన షేర్లను, శ్రీనివాసు రాం సందకకు చెందిన రూ.153.10 కోట్ల విలువైన షేర్ల విక్రయించనున్నారు.

## జియోకు పెరిగిన కస్టమర్లు

న్యూఢిల్లీ, మే 7: దేశీయ టెలికం దిగ్గజం రిలయన్స్ జియో కస్టమర్లను ఆకట్టుకోవడంలో దూసుకుపోతున్నది. మార్చి నెలలోనూ 21.74 లక్షల మంది జియో నెట్‌వర్క్ పరిధిలోకి చేరడంతో మొత్తం సంఖ్య 46.97 కోట్లకు చేరుకున్నారని టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ వెల్లడించింది. అలాగే భారతీ ఎయిర్‌టెల్ పరిధిలోకి 12.50 లక్షల మంది చేరడంతో మొత్తం సంఖ్య 38.98 కోట్లకు చేరుకున్నారు. కానీ, వొడాఫోన్ ఐడియా మాత్రం 5.41 లక్షల మంది మొబైల్ కస్టమర్లను కోల్పోయింది. దీంతో కంపెనీ కస్టమర్ల సంఖ్య 20.53 కోట్లకు పడిపోయారు.

## బెనెల్లీ సరికొత్త స్పోర్ట్స్ బైకు




హైదరాబాద్, మే 7: స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ బెనెల్లీ..దేశీయ మార్కెట్‌కు మరో మోడల్‌ను పరిచయం చేసింది. నూతన టీఆర్‌కే 2025 సిరీస్‌లో భాగంగా విడుదల చేసిన మూడు రకాల్లో లభించనున్న ఈ బైకు ప్రారంభ ధర రూ.6.20 లక్షలుగా నిర్ణయించింది. ఇంటిగ్రేటెడ్ నావిగేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ, కంఫర్ట్, స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ, స్క్రీన్ మిర్రరింగ్, ట్యూబ్‌లెస్ టైర్లు, టైర్ ప్రెషర్ మానిటరింగ్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో తయారు చేసింది. మూడు రంగుల్లో లభించనున్న టీఆర్‌కే 502 మోడల్ ధర రూ.6.20 లక్షలు, టీఆర్‌కే 502 ఎక్స్ మోడల్ రూ.6.70 లక్షలు, టీఆర్‌కే 502 ఎక్స్ లిమిటెడ్ ఎడిషన్ రూ.6.85 లక్షలకు విక్రయిస్తున్నది. ఈ బైకుపై రెండేండ్లు అన్‌లిమిటెడ్ కిలోమీటర్ల వ్యారెంటీ, రోజంతా రోడ్ సైడ్ అసిస్టెన్స్ సేవలు అందిస్తున్నది.

## హెచ్‌డీఎఫ్‌సీ వడ్డీరేట్ల తగ్గింపు

బెంగళూరు, మే 7: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మరోసారి వడ్డీరేట్లను తగ్గించింది. ఎంసీఎల్ఆర్‌తో అనుసంధానమైన రుణాలపై వడ్డీరేటును 15 బేసిస్ పాయింట్ల వరకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. దీంతో నెల రోజుల కాలపరిమితి కలిగిన రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 10 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో రుణరేటు 9 శాతానికి దిగిరాగా, అలాగే మూడు నెలల రుణాలపై రేటు 15 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో 9.05 శాతానికి దిగొచ్చాయి. ఆరు నెలల రుణాలపై రేటు 9.10 శాతానికి తగ్గాయి.

## రూపాయి 42 పైసలు డౌన్

న్యూఢిల్లీ, మే 7: భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంతో ఈక్విటీలతోపాటు రూపాయి కూడా డీలాపడింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బుధవారం ఒకేరోజు 42 పైసలు పడిపోయి 84.77 వద్ద ముగిసింది. 84.65 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ రేటు ఇంట్రాడేలో 84.47 గరిష్ఠ స్థాయిని, 84.94 కనిష్ఠ స్థాయిని తాకింది.

## రూపం మార్చుకునే ప్రోటీన్లు

**సీసీఎంబీ పరిశోధనలో వెల్లడి**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): అనేక వ్యాధులను సమర్థంగా ఎదుర్కొనే మందుల తయారీకి, పంట లక్షణాలను అత్యంత కచ్చితత్వంతో అంచనా వేసేందుకు అవసరమైన ప్రొటీన్ల మార్పిడిపై సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) పరిశోధకులు విజయం సాధించారు. త్రీడీ ఆకారంలో స్థిరంగా ఉండే ప్రొటీన్లు పరిస్థితులకు తగ్గట్టుగా తమ రూపాన్ని తాత్కాలికంగా మార్చుకుని జీవక్రియలు నిర్వహిస్తాయని తేల్చారు. డాక్టర్ మందార్ దేశ్‌ముఖ్ సారథ్యంలో జరిగిన ఈ పరిశోధన.. వైద్యం, వ్యవసాయం, బయోటెక్నాలజీ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలకు దోహదపడుతుందని సీసీఎంబీ శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## బీజాక్షరం, గోదావరి హారతిపై చర్చ



బాసర, మే 7 : నిర్మల్ జిల్లా బాసర సరస్వతీ అమ్మవారిని బుధవారం కేంద్రం మాజీ మంత్రి వేణుగోపాలాచారి దర్శించుకున్నారు. వేద పాఠశాల ఆధ్వర్యంలో గోదావరి ఘాట్ వద్ద నిర్వహిస్తున్న నిత్యహారతిపై పూజారులతో ఆయన చర్చించారు. బీజాక్షరాల విషయంపై కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిలతోపాటు దేవాదాయ శాఖ కమిషనర్‌తో ఫోన్‌లో చర్చించినట్టు సమాచారం.

## ఉపసర్పంచ్ హత్య

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 7 : మావోయిస్టులు ఓ గ్రామ ఉప సర్పంచ్‌ను హత్య చేసిన ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీజాపూర్ జిల్లా జగర్‌గూండ పోలీస్‌స్టేషన్ పరిధి తార్లగూడ ఆధారిత బెన్‌పల్లి ఉప సర్పంచ్ ముచకి రామ మంగళవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్నాడు. గ్రామీణ దుస్తుల్లో వచ్చిన ఐదుగురు మావోయిస్టులు అతడిని ఇంట్లో నుంచి బయటకు లాక్కొచ్చి ప్రజలు చూస్తుండగానే గొంతుకోసి దారుణంగా హత్య చేశారు. జగర్‌గూండ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రామ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

# సైనిక్ స్కూళ్లలో రాష్ట్రానికి అన్యాయం

- తెలంగాణలో ఒక్కటీ ఏర్పాటు చేయని కేంద్ర ప్రభుత్వం
- చొరవ తీసుకోవడంలో రాష్ట్ర సర్కార్ ఫెయిల్
- ఏపీ స్కూళ్లలో తెలంగాణకు లోకల్ కోటా ఇవ్వాలి
- లోకల్ కోటా కోసం న్యాయంపోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్




హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): సైనిక్ స్కూళ్ల ఏర్పాటులో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఒక్క స్కూల్ కూడా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయలేదని, ఈ విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం చొరవ తీసుకోలేదని విమర్శించారు. సైనిక్ స్కూళ్లు ఏపీకి తరలిపోతుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఏపీలోని కోరుకొండ, కలికిరి వంటి సైనిక్ స్కూళ్లలో తెలంగాణ విద్యార్థులకు కూడా లోకల్ కోటా వర్తింపచేసి, ఆ ప్రకారం అడ్మిషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు ఏపి సైనిక్ స్కూళ్లలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులకు 67 శాతం లోకల్ కోటా అమలు చేసేవారని, కానీ ఈ లోకల్ కోటా నుంచి తెలంగాణ విద్యార్థులను తొలగిస్తూ కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు సైనిక్ స్కూళ్లలో అడ్మిషన్లు పొందాలంటే 33 శాతం ఓపెన్ కోటాలోనే జాతీయ స్థాయిలో పోటీపడాల్సి ఉంటుందని తెలిపారు. సైన్యంలో చేరాలన్న లక్ష్యం తెలంగాణ విద్యార్థులకు అందని ద్రాక్షలాగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. సైనిక్ స్కూళ్లలో లోకల్ కోటాను పునరుద్ధరించేంత వరకు తాము న్యాయ పోరాటం చేస్తామని స్పష్టంచేశారు.

### తెలంగాణపై కేంద్రం వివక్ష

ఏపీ విభజన చట్టం ప్రకారం వరంగల్ జిల్లాలో ఒక సైనిక్ స్కూల్ ఏర్పాటు చేయడానికి కేంద్రం సానుకూలం వ్యక్తం చేసిందని, కానీ అందుకోసం భూమి, భవనాలతోపాటు జీతభత్యాల ఖర్చులన్నీ తెలంగాణ ప్రభుత్వమే భరించాలని కేంద్ర మెలిక పెట్టిందని తెలిపారు. దీనిని తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ.. కేంద్రానికి సుదీర్ఘ లేఖ రాసి, మిగితా సైనిక్ స్కూళ్ల మాదిరిగానే దీనిని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసినట్టు గుర్తుచేశారు. కేసీఆర్ డిమాండ్‌కు కేంద్రం ససేమిరా అనడంతో అది పెండింగ్‌లో ఉన్నదని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నప్పటికీ ఈ విషయాన్ని వారు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ విషయంలో జోక్యం చేసుకుని, ఢిల్లీ పెద్దలతో సంప్రదింపులు జరిపి, తెలంగాణలో ఒక సైనిక్ స్కూల్ ఏర్పాటయ్యేలా చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో ఆపరేషన్ అభ్యాస్



**నాలుగు చోట్ల భద్రతా బలగాల మాక్‌డ్రిల్**

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట భద్రతా బలగాలు బుధవారం ఈ మాక్‌డ్రిల్ చేపట్టాయి. మాక్‌డ్రిల్‌లో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, పోలీసు, అగ్నిమాపక, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఎన్‌సీసీ, వైద్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, విద్యుత్తు, ట్రాన్స్‌పోర్టు సహా మొత్తం 12 విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సికింద్రాబాద్, నానల్‌నగర్, కంచన్‌బాగ్ డీఆర్‌డీవో, గోల్కొండ కంటోన్మెంట్ పరిసర ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల సమయంలో 2నిమిషాల పాటు సైరన్ మోగించారు. అగ్నిప్రమాదం జరిగినట్టు, బాంబులు పేలినట్టు శబ్దాలు వినిపించాయి. సంఘ విద్రోహశక్తులు, ఉగ్రవాదులు అపార్ట్‌మెంట్లలోకి చొరబడి కాల్పులు జరిపినట్టు, వివిధశాఖ ఆధ్వర్యంలో సహాయ చర్యలు చేపట్టినట్టు చూపించారు. కొన్ని ప్రాంతాల్లో బాంబు పేలుళ్లు, కాల్పుల వల్ల మంటలు వ్యాపిస్తే వాటిని ఆర్పేందుకు ఫైరింజన్లు మోహరించారు. అత్యవసర పరిస్థితుల్లో స్పందించాల్సిన తీరుపై ప్రజలకు అవగాహన కల్పించామని అధికారులు చెప్పారు. ప్రజలు పూర్తిగా సహకరించారని తెలిపారు.

## మీటింగ్ మినట్స్‌లో అవాస్తవాలు

- జీఆర్ఎంబీ తీరుపై తెలంగాణ అభ్యంతరం
- బోర్డుకు ఈఎన్సీ అనిల్ లేఖ

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) మీటింగ్ మినట్స్ డ్రాఫ్ట్‌లో వెల్లడించిన అంశాలు అవాస్తవాలని తెలంగాణ మండిపడింది. బోర్డు తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఈఎన్సీ అనిల్‌కుమార్ తాజాగా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. జీఆర్ఎంబీ సమావేశాన్ని గత నెలలో నిర్వహించారు. ఆ భేటీలో నమోదు చేసిన అంశాలను వివరిస్తూ తాజాగా బోర్డు రెండు రాష్ట్రాలకు మినట్స్ డ్రాఫ్ట్ నోట్‌ను పంపింది. దానిపై అభ్యంతరాలు, సవరణలేమైనా ఉంటే తెలపాలని కోరింది. దీంతో ఆ డ్రాఫ్ట్ నోట్‌లోని అంశాలను తెలంగాణ ఈఎన్సీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ జీఆర్ఎంబీ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బోర్డుకు సంబంధించిన వివరాలపై చైర్మన్ అనుమతి తీసుకునే ప్రెజెంటేషన్ ఇచ్చామని, కానీ అందుకు విరుద్ధంగా కావాలనే జోక్యం చేసుకుని, సొంత ఎజెండాను ప్రజెంట్ చేశారని పేర్కొనడం ఏమిటని మండిపడ్డారు. ప్రెజెంటేషన్‌లో తెలంగాణ వెల్లడించిన అంశాలను మినట్స్‌లో పొందుపరచలేదని ధ్వజమెత్తారు.

# రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలతో రాష్ట్రానికి అప్రతిష్ట

- పాలన చేతగాకుంటే రాజీనామా చేయాలి
- మాజీ మంత్రి ఎర్రబెల్లి



జనగామ జిల్లా దేవరుప్పులలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి/తొర్రూరు/పెద్దవంగర/దేవరుప్పుల, మే 7 : పరిపాలనా అనుభవంలేని రేవంత్‌రెడ్డి తెలంగాణ అప్పులకుప్పగా మారిందని చెబుతూ ప్రపంచస్థాయిలో రాష్ట్రం పరువును గంగలో కలుపుతున్నాడని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మండిపడ్డారు. బుధవారం ఆయన వరంగల్ జిల్లా రాయపర్తి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు, పెద్దవంగరలో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రేవంత్‌రెడ్డి చేతగాని మాటల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఏ కంపెనీ ముందుకురావడంలేదని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పాలించడం చేతగాని రేవంత్‌రెడ్డి వెంటనే సీఎం పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌చేశారు. పెద్దవంగరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. మరోవైపు పహల్గాంలో పాకిస్థాన్ టెర్రరిస్టులు పొట్టన పెట్టుకున్న మృతుల ఆత్మకు ఆపరేషన్ సిందూర్‌తో శాంతి కలిగిందని ఎర్రబెల్లి పేర్కొన్నారు. జనగామ జిల్లా దేవరుప్పులలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ప్రపంచదేశాల మద్దతు కూడగట్టిన ప్రధాని మోదీకి రాజకీయాలకతీతంగా దేశం మద్దతుగా నిలుస్తున్నదని చెప్పారు. ఆపరేషన్‌లో పాల్గొన్న జవాన్లకు సెల్యూట్ చేశారు.

## దేశవ్యాప్తంగా 'ఆపరేషన్ అభ్యాస్'

- కీలక ప్రాంతాల్లో మాక్ డ్రిల్స్

న్యూఢిల్లీ, మే 7: భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఒకవేళ వైమానిక దాడులు, భారీగా అగ్ని ప్రమాదాలు జరిగితే పౌరులు తమ ప్రాణాలను ఎలా కాపాడుకోవాలి అన్న అంశంపై అవగాహన కల్పించేందుకు బుధవారం తెలంగాణ సహా పలు రాష్ట్రాలు 'ఆపరేషన్ అభ్యాస్' పేరిట మాక్ డ్రిల్‌లు నిర్వహించాయి. ఆపరేషన్ సిందూర్ పేరిట భారత త్రివిధ దళాలు పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై దాడులు జరిపిన కొన్ని గంటలకే మాక్ డ్రిల్స్ ప్రారంభమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా పలు ప్రధాన నగరాలు, కీలక ప్రాంతాల్లో ఈ డ్రిల్స్ జరిగాయి. ఢిల్లీలో 55 ప్రాంతాల్లో ఈ డ్రిల్స్ నిర్వహించారు. నగరమంతటా పోలీసు వాహనాలు, అగ్నిమాపక శకటాలను మోహరించారు. డ్రిల్ ప్రారంభం కాగానే సైరన్లు మోగాయి, వెంటనే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. గాయపడిన వారిని స్ట్రెచర్ల మీద దవాఖానలకు తరలించారు. ఇక పలు బహుళ అంతస్తుల భవనాల్లో చిక్కుకున్న వారిని కాపాడేందుకు అగ్నిమాపక దళాలు క్రేన్లను ఉపయోగించాయి. ఘటనా స్థలాలకు డాక్టర్లు, అంబులెన్స్‌లు పరుగులు తీశాయి. సైరన్ మోగగానే కార్యాలయాల్లో ఉద్యోగులు విద్యుత్తు పరికరాలను ఆపివేసి డెస్క్‌ల కింద చేరి దాక్కున్నారు. దేశవ్యాప్తంగా సుమారు 300 ప్రదేశాల్లో ఈ డ్రిల్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సున్నిత ప్రాంతాలైన అణు స్థావరాలు, సైనిక స్థావరాలు, రిఫైనరీలు, జలవిద్యుత్తు కేంద్రాలకు పూర్తి భద్రత కల్పించారు. రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్), ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ) వేర్వేరుగా, సంయుక్తంగా ఈ డ్రిల్స్ చేపట్టాయి. ప్రమాద స్థలి నుంచి ప్రజలను కాపాడే ప్రక్రియలో ఎన్డీఆర్ఎఫ్, ఎన్సీసీ దళాలు కూడా తమ పాత్ర పోషించాయి.

## 325 చోట్ల సైబర్ నేరాలపై అవగాహన

- సీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్ వెల్లడి

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): 'సైబర్ జాగృత దివస్'ను పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా 325 ప్రాంతాల్లో సైబర్‌నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్టు సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీజీ శిఖాగోయెల్ తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. కళాశాలలు, వైద్యసంస్థలు, ప్రైవేట్ ఆఫీస్‌లు, ప్రజా సమావేశ స్థలాలు, బస్టాండ్‌లలో ఈ సెషన్లు నిర్వహించినట్టు పేర్కొన్నారు. కొత్త పద్ధతుల్లో పుట్టుకొస్తున్న సైబర్ నేరాలను అడ్డుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించామని వివరించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో ఆకర్షణీయమైన ఆఫర్‌లు సృష్టించి.. యూపీఐ, ఈ-వాలెట్‌ల ద్వారా మోసం చేస్తున్నారని తెలిపారు. పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో గృహిణులు, నిరుద్యోగుల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ నంబర్ ప్లేట్, ఫాస్టాగ్, హెచ్ఎస్ఆర్పీల పేరిట మోసాలకు పాల్పడుతున్నారని.. ఈ తరహా మోసాలపై అవగాహన కల్పించామని చెప్పారు. సైబర్ నేరాల బారినపడిన వారు వాట్సాప్ నంబర్ 8712672222కు రిపోర్ట్ చేయాలని ఆమె సూచించారు.

## ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలి

**మంత్రి దామోదరకు టీజీజీడీఏ వినతి**

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా, గాంధీ, కాకతీయ(కేఎంసీ), నిజామాబాద్(జీఎంసీ) ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ డిమాండ్ చేసింది. బుధవారం టీజీజీడీఏ రాష్ట్ర అధ్యక్షుడు నరహరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి ఖాజా రౌఫిద్దిన్, సభ్యులు హైదరాబాద్‌లో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఇటీవల చేపట్టిన ఆయా విభాగాల్లో ప్రొఫసర్ల బదిలీలపై ఉన్న ఆంక్షలను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఫ్యాకల్టీ లేకపోవడంతో వైద్య విద్యపై ప్రభావం చూపుతున్నదని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రెండు అంశాలపై మంత్రి చొరవ చూపి సమస్యను పరిష్కరించాలని కోరారు.